జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 2-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 525 పేజీలు: 4 వెల: రూ.7

# కుళాయి నీరు.. సురక్షితమేనా?

* శ్రీకాకుళం నగరపాలక సంస్థలో సక్రమంగా జరగని క్లోరినేషన్ * రోజుకు రెండు పూటలు చేయని క్లోరినేషన్ * ఒక్కపూటకే పరిమితమైన కాంట్రాక్టర్ * లక్షల్లో బిల్లులు చేసుకుంటున్న వైనం * తనిఖీలు చేయని హెల్త్ అధికారులు * రోగాల బారిన నగరవాసులు * ప్రజల ఆరోగ్యంతో చె(జ)లగాటం





**శ్రీకాకుళం, డిసెంబర్ 1 (వార్త):** శ్రీకాకుళం నగరవాసులకు నిత్యం కుళాయిల ద్వారా నగరపాలక సంస్థ అధికారులు నీటిని అందిస్తున్నారు. అయితే ఈ నీరు ఎంతవరకు సురక్షితమన్నది తనిఖీ చేయాల్సిన మున్సిపల్ హెల్త్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కుళాయిల ద్వారా పంపిణీ చేస్తున్న నీటిని రోజుకు రెండు పూటలు క్లోరినేషన్ చేయాలి. కాని సంబంధిత కాంట్రాక్టర్ రోజుకు ఒక్కసారి మాత్రమే క్లోరినేషన్‌ను నామమాత్రంగా చేస్తున్నారని ఈ ప్రక్రియ చేపడుతున్న సిబ్బందే బహిరంగంగా చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని 14 ట్యాంకులను క్లోరినేషన్ చేయాల్సిన బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌కు నగరపాలక సంస్థ అధికారులు అప్పగించారు. రెండు సార్లు చేస్తున్నట్టు కాంట్రాక్టర్ మాత్రం లక్షల్లో బిల్లులు జేబులో వేసుకుంటున్నాడు. ఈ క్లోరినేషన్ ప్రక్రియను నగరపాలక సంస్థ హెల్త్ అధికారులు పరిశీలన చేయకపోవడంతో కాంట్రాక్టర్‌కు వరంగా, నగరవాసులకు శాపంగా మారింది. క్లోరినేషన్ చేయని నీటిని తాగుతున్న నగరపాలకవాసులు రోగాల బారిన పడి ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇకనైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి ఈ క్లోరినేషన్ ప్రక్రియను తనిఖీ చేసి ప్రజలకు సురక్షిత నీటిని అందించాల్సివుంది.







## తాళ్లవలసలో డయేరియాపై సీఎం ఆరా

* పారిశుధ్య పనులు చేపట్టకపోవడం, కలుషిత నీరే కారణమంటున్న గ్రామస్థులు * గ్రామంలో వైద్యసేవలు అందించండి: మంత్రి అచ్చెన్నాయుడు * గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



**సంతబొమ్మాళి, డిసెంబర్1 (వార్త):** సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామంలో డయేరియా వ్యాధి విజృంభించి ఒకరు మృతి చెందగా, పలువురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. మార్పు చిన్నారావు (72) టెక్కలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గున్న రుద్రమ్మ, గున్న పాపారావు, సీపాన కొండయ్య, చల్ల రాములు తదితరులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అలాగే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బండారు గోవిందరావుకు శ్రీకాకుళం రిమ్స్ చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించకపోవడం వల్ల డయేరియా సోకిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో పంటచేల మధ్యనున్న నేలబావి నీరు ఇంటింటి కుళాయిల ద్వారా సరఫరా చేయడంతోనే డయేరియా సోకి వుంటుందని వాపోయారు. వైద్యులు, సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు, బావులలో క్లోరినేషన్ చేశారు. తాళ్లవలస గ్రామంలో డయేరియా వ్యాప్తి చెందిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తక్షణమే స్పందించారు. ఈ విషయమై ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి, గ్రామంలో నెలకొన్న పరిస్థితుల వివరాలను తెలుసుకున్నారు. డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణమే గ్రామాన్ని సందర్శించి, సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఆ గ్రామానికి వైద్య బృందాలను పంపించి, బాధితులకు అత్యవసర చికిత్స అందించాలని, శుభ్రతా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. తాళ్లవలసలో డయేరియా కేసుల నమోదుపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. వృద్ధుడి మరణానికి కిడ్నీ సమస్య, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూరే కారణమని వైద్యారోగ్యశాఖ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

# ఎమ్మెల్యే కూనకు.. నిరసన సెగ!



* వెన్నెలవలసలో పింఛన్ల పంపిణీకి వెళ్లి ఎమ్మెల్యే కూన * గో బ్యాక్ ఎమ్మెల్యే అంటూ అడ్డుకున్న గిరిజనులు * టీడీపీ శ్రేణులు, గిరిజనుల మధ్య వాగ్వాదం * థర్మల్ ప్లాంట్‌పై అపోహలు తొలగిస్తాం * తప్పుడు ప్రచారాలు చేసే వారిని నమ్మొద్దు * ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



**శ్రీకాకుళం/సరుబుజ్జిలి, డిసెంబర్1 (వార్త):** సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా సోమవారం సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన గ్రామానికి వెళ్లిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు నిరసన సెగ తగిలింది. గ్రామంలోకి అడుగుపెట్టగానే పలువురు గిరిజనులు అడ్డుకున్నారు. గో బ్యాక్ ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, గిరిజనుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే కూన రవి వారిని వారించేందుకు ప్రయత్నించారు. థర్మల్ పవర్ ప్లాంట్ మీద గిరిజనులకు ఉన్న అపోహలను తొలగిస్తామని కూన రవి అన్నారు. ఇది సర్వే దశలో ఉందని, థర్మల్ పవర్ ప్లాంట్ వస్తుందో రాదో ఇంకా తెలియదన్నారు. ఒకవేళ వస్తే అందరి ఆమోదంతోనే ఎవరికి ఎటువంటి నష్టం జరగకుండా మంచి నిర్ణయం ఉంటుందన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వ్యక్తులను నమ్మవద్దని, మన ప్రాంత అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో గిరిజనులకు సామాజిక పింఛన్లు అందించి వెనుదిరిగారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, డిసిసిబి చైర్మన్ శివాల సూర్యం, నందివాడ గోవిందరావు, అంబాల రాంబాబు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, థర్మల్ పవర్‌ప్లాంట్‌పై గత కొద్ది కాలంగా అగ్గి రాజుకుంటోంది. గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు ఇప్పటికే పోరుబాట పట్టారు. ఈ పవర్‌ప్లాంట్ వల్ల తమకు తీరని నష్టం జరుగుతుందని గిరిజన సంఘాలు చెబుతున్నారు. సోంపేట, సంతబొమ్మాళి మండలాల్లో పవర్‌ప్లాంట్ ఉద్యమం గట్టిగా జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ పవర్ ప్లాంట్ వద్దంటూ కోర్టులో కూడా సంఘాలు కేసు వేశారు.

## పేలుతున్న ఫ్రిడ్జ్‌లు

**ఇచ్ఛాపురం, డిసెంబర్1 (వార్త):** జిల్లాలో ఫ్రిడ్జ్‌లు పేలుతున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఓ ఇంట్లో ఫ్రిడ్జ్ పేలి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మరువకముందే ఇచ్ఛాపురం పట్టణంలోని ముత్యాలమ్మపేటలో సోమవారం ఫ్రిడ్జ్ పేలిన ఘటన ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ముత్యాలమ్మపేటలో డి.లక్ష్మణ్‌నాయుడు ఇంట్లో ఫ్రిడ్జ్ పేలడంలో గదిలోని సామగ్రి కాలి బూడిదయ్యాయి. మొత్తం రూ.5లక్షల వరకూ నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

## జర్నలిస్టుపై దాడి

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 1 (వార్త):** జలుమూరు మండలం అక్కురాడ గ్రామానికి చెందిన ఓ పత్రిక స్టాఫ్ రిపోర్టర్ కుంచి అప్పలస్వామిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేశారు. దీన్ని ఏపీయూడబ్ల్యూజే శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంచి చిన్నారావు, యూనియన్ సీనియర్ నాయకులు ఎన్ ఈశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఇదే విషయంపై సోమవారం జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డికి యూనియన్ సభ్యులతో కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. అక్కురాడ గ్రామంలో మిగులు భూమి విషయమై చింతాడ త్రినాధ రావు అనే వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి సుమారుగా 12 సెంట్లు స్థలాన్ని ఆక్రమించేశాడు. ఈవిషయమై అప్పలస్వామి పలుమార్లు మండల రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భూమి ఆక్రమించిన వారు.. అప్పలస్వామితో పాటు కుటుంబీకులపై దాడికి పాల్పడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల రమేష్, నరసన్నపేట యూనియన్ ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, జిల్లా గరిమెళ్ల ప్రెస్ క్లబ్ కార్యదర్శి చౌదరి సత్యనారాయణ, బుజ్జి, జయప్రకాష్ నాయుడు, జిల్లా ఎస్సీ ఎస్టీ జర్నలిస్టుల నాయకులు పిన్నింటి అప్పన్న, నారాయణమూర్తి పలువురు జర్నలిస్టులు ఉన్నారు.

## బస్సు, వ్యాన్ ఢీ

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 1 (వార్త):** పొందూరు మండలం లోలుగు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి వ్యాను, ప్రైవేటు బస్సు ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళితే.. ఒడిశాకు చెందిన ప్రైవేటు బస్సు జైపూర్ నుంచి బరంపురం వెళుతుండగా, చిలకపాలెం నుంచి వస్తున్న వ్యాను ఎదురెదురుగా ఢీ కొట్టాయి. ఆ సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. బస్సు, వ్యాను ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. వ్యాన్ డ్రైవర్‌ను వాహనం నుంచి తీయడానికి చాలా సమయం పట్టింది. ఆ తర్వాత ఆయనను శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

## మరో యువకుడు మృతి

**పలాస, డిసెంబర్ 1 (వార్త):** తమిళనాడు మదురైలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలాస మండలం వీరరామచంద్రాపురానికి చెందిన గుంట రాజు(30) సోమవారం మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో వీరరామచంద్రాపురానికి చెందిన పి. సాయి, పెదంచలకు చెందిన ఐ.నవీన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు కూడా మృతి చెందాడు. ఆయన మెళియాపుట్టి మండలం గోకర్ణపురం సచివాయలంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తుండేవారు. ప్రమాదంలో గాయపడిన తారకేశ్వరరావు, గణేష్, గణపతిల ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

## బంగ్లాదేశ్ మత్స్యకారులకు రిమాండ్

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 1 (వార్త):** బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు ఆదివారం ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ మూసవానిపేట తీరానికి ఆదివారం చేరుకున్న విషయం తెలిసిందే. వీరిని మెరైన్ సీఐ బోర ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. తుఫాన్ కారణంగా పడవ మరమ్మతులకు గురై భారత్ సముద్ర జలాల్లోకి కొట్టుకువచ్చిందని వారు తెలిపారు. బంగ్లాదేశ్‌కు చెందిన మత్స్యకారులు షకీర్, జహంగీర్, షబ్బీర్, కోకన్, మక్‌సూద్, మాలిక్, ఎండీ ఫరూక్, మాక్‌సూద్ వలీ, నజీర్, హెలాల్, ఫరూక్, అలాం, సమీమ్‌లకు సోమవారం వైద్య పరీక్షలు చేసిన తర్వాత నరసన్నపేటలోని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఈ నెల 15 వరకు రిమాండ్ విధించారు. వారిని నరసన్నపేట సబ్‌జైలుకు తరలించామని మెరైన్ సీఐ ప్రసాదరావు తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కేళీ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**సోంపేట, డిసెంబరు 1(వార్త):** ఖరీఫ్ వరి సాగులో సోంపేట మండల పరిసర ప్రాంతాల్లో కేళీలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీ రావు కోరారు. ఈ మేరకు తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు వేరువేరుగా ఫిర్యాదులు చేయడంతో సోమవారం సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకరరావు, వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తి పలాసపురం సమీపంలో పొలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా పంట పరిస్థితిని ఢిల్లీలో అధికారులకు వివరించారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి తగు నివేదిక ఇవ్వాలని కోరారు.



## మందస జూనియర్ కళాశాల రక్షణకు ప్రజా పోరాటానికి మద్దతు

### -దేవుడి పేరుతో కాలేజీ ఆక్రమణను వ్యతిరేకించండి
### -ప్రజల ఆస్తులను దోచుకుంటే ప్రతిఘటన తప్పదు
### -సీపీఐఎంఎల్ లిబరేషన్, ఐసా, ఐప్వా, ఏఐసీసీటీయు

**మందస, డిసెంబరు 1(వార్త):** మందస జూనియర్ కాలేజీ పరిరక్షణకు ప్రజలు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్ధతు ఇస్తున్నామని సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఐసా, ఐప్వా, ఏఐసీసీటీయూ నాయకులు ప్రకటించారు. సోమవారం వారు కళాశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో కాలేజీని ప్రభుత్వం నిర్మించిందని, చిన్నజీయర్ స్వామి కళాశాలను ఆనించి ఉన్న గోపాలసాగరం, శివాలయం, భూమిని ఆక్రమించడానికి ప్రజలపై వాజ్యాలు వేస్తూ కోర్టులు చుట్టూ తిప్ప డాన్ని ముక్తకంఠంతో ఖండిస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఉపయో గించుకుని, ప్రజల ఆస్తులు కొల్లగొట్టాలని ప్రయత్నిస్తే, ప్రజాప్రతిఘటనని ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. గోపాలసాగరాన్ని ఆక్రమిస్తే, ఎంతో మంది పేద రైతులు సాగునీరందక వీధిన పడడమే కాకుండా, రెండు పంటలు పండే ఈ భూములు బీడు భూములుగా మిగిలి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేద పాఠశాల పేరుతో సంత స్థలాన్ని దురాక్రమించి తమ సొంతానికి వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి పరచి డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. అయ్యప్ప స్వాములు శివాలయం ఆవరణలోని ఖాళీస్థలంలో సన్నిధానాన్ని నిర్మించుకుంటే దాని నిర్మాణానికి వాసుదేవ పెరుమాళుకు చెందిన వ్యక్తులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు, ప్రగతిశీల మహిళ సంఘం నాయకురాలు కోనారి ఈశ్వరమ్మ, ఏఐసీసీటీయూ జిల్లా నాయకుడు పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



**మందస, డిసెంబరు 1(వార్త):** దేవుపురము, పెట్టువా గ్రామంలో ప్రకృతి వ్యవసాయ భూములను రీజనల్ టీం ప్రకాష్, హేమసుందర్, అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, ట్రైనింగ్ ఎన్‌ఎఫ్‌ఏ గోవింద్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆముదము, కంది, సజ్జ, అనుములు, గోరుచిక్కుడు, బెండ, గోంగూర, తోట కూర, ముల్లంగి వంటి అదనపు ఆదాయం తెచ్చే విత్తనాలను.. సూర్యరశ్మి భూమికి తగలకుండా వేయించామన్నారు. భూమికి సూర్యరశ్మి తగలకుండా అనేక సూక్ష్మజీవులు ఉత్పన్నమవుతాయని, భూమి తేమ కోల్పోకుండా ఉంటూ పోషకాలు అధిక మోతాదులో వృద్ధి చెందుతాయన్నారు. ప్రతీ రైతు కూడా ఈ ఆర్డీఎస్ పద్ధతిని అనుసరించాలని ప్రకాష్ కోరారు. ఖరీఫ్ సీజన్ వరకు భూమిలో పంటలు ఉండాలని, అలాంటప్పుడే నేల తల్లిని కాపాడగలమని హేమసుందర్ వివ రించారు. కార్యక్రమంలో పలాస డివిజన్ ఎంఎఫ్ఏ శివాజీ, ఎంప్టీ సూర్యనారా యణ, ఎఫ్ఎమ్టీస్, ఐసిఆర్పీస్, టీఐసిఆర్పీస్, రైతులు పాల్గొన్నారు.

## సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



**మందస, డిసెంబరు 1(వార్త):** కడపలో జరుగుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. చిన్నబరంపురంలో సోమవారం వారు విస్తృత ప్రచారం చేప ట్టారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు మద్దిల రామారావు మాట్లాడుతూ దేశంలో పూర్తిగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అమలులో లేని పరిస్థితిని మనం చూస్తున్నామన్నారు. దేశ సంపదలన్నీ కార్పొరేట్లకు తాకట్టు పెట్టి, దేశాన్ని మరింత అప్పులపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలను రోజుకొక ఎన్‌కౌంటర్ చేసి చంపుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఒక తాటిపైకి రావాలని ఐప్వా నాయకులు కె.ఈశ్వరమ్మ, ఏఐసీసీటీయు నాయకులు పి.నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. మందస మహేంద్ర సంఘం నాయకులు సింహాద్రి, కోదండం, రవి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

## సొండిపూడి విద్యార్థులకు అభినందన



**మందస, డిసెంబరు 1(వార్త):** గుడారిరాజమణిపురం జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన గ్రిగ్స్ పోటీల్లో సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. సీనియర్ బాలుర కబడ్డీ పోటీలో హరిపురంపై ఫైనల్‌లో గెలిచి ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. బాలికల కబడ్డీ పోటీల్లో ఫైనల్స్‌లో బహడపల్లి హైస్కూల్‌పై విజయం సాధించి ప్రథమస్థానం సంపాదించారు. వీరంతా జిల్లాస్థాయి మీట్‌లో తలపడనున్నారు. పిట్ట రాహుల్ అనే విద్యార్థి ఇటీవల పల్నాడు జిల్లా వెనుగొండలో జరిగిన స్టేట్ మీట్‌లో 1500 మీటర్ల పరుగు పందెంలో ఏడోస్థానం సంపాదించి మండలానికి ఆదర్శంగా నిలిచాడు. హరిపురంలో జరిగిన ఎన్ఎంఎంఎస్ మాక్ టెస్ట్‌లో 120 మార్కులు సంపా దించి, లండ కౌశిక్ ఐదో స్థానంలో నిలిచాడు. విజేతలను పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సుందర సోలమన్, పాఠశాల పీడీ ఎస్.విజయ్ అభినందిస్తూ, రానున్న పదవ తరగతి పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, వై.తులసీదాస్, నగిరి అరుణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థుల మేలుకోసమే జగన్ ఆరాటం

### -జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ

**సోంపేట, డిసెంబరు 1(వార్త):** రాష్ట్రంలో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వైద్య విద్యార్థుల మేలుకోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరాట పడుతున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేటలో పట్టణ వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న కోర్టు సంతకాల సేకరణలో విజయ పాల్గొన్నారు. మెయిన్ రోడ్‌లో వైయస్సార్ విగ్రహం ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె ల్ణ మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి గత ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీలను గంపగుత్తగా కార్పొరేట్లకు అప్పగించి వాటాలు అందుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సాగిస్తున్న కుట్రను అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. భవిష్యత్తులో మన విద్యార్థులు ఉచిత మెడికల్ సీట్లు పొందాలంటే ప్రభుత్వ ఆధ్వర్యంలో కాలేజీలు కొనసాగాలన్నారు. ఎందుకు మద్దతుగా అన్ని వర్గాలు సహకరిస్తున్నందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు జక్కం రమేష్, పొడుగు కామేష్, సంగారు గోవింద్, టెంక రాజారావు తదితరులు పాల్గొన్నారు.




## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం



**జి.సిగడాం, డిసెంబరు 1(వార్త):** కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్య మని ఎమెల్యే నడికుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం చెట్టుపొదిలాంలో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతానని తెలిపారు. ఎన్నికల హామీమేరకు విద్యుత్ చార్జీలు తగ్గించినట్టు తెలిపారు. పింఛనును రూ.4000కు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు శ్రీరామూర్తి, భూపతి చంద్రశేఖర్, జిల్లా జనసేన నాయకులు భూపతి అర్జున్ కుమార్, గౌరీ నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, ఏఎంసీ ఉపాధ్యక్షులు బూరాడ వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, రైల్వే జోనల్ సలహా సభ్యులు బాలబొమ్మ వెంకటేశ్వరరావు, సర్పంచ్ భూపతి సురేష్, బోగాది అప్పలనాయుడు, సాకేటి నాగరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, జిల్లా జనసేన కార్యదర్శి తాళ్లబత్తుల పైడిరాజు, ఎంపీడీవో జి.రామ కృష్ణారావు, ఎంఈవో ముళ్ల శ్రీనివాసరావు, కూనిబిల్లి కూర్మారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఏసీ దృష్టికి జన సైనికుల కష్టాలు

**పలాస, డిసెంబరు 1(వార్త):** పలాస-కాశీబుగ్గ కేటీ రోడ్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జన సైనికులు అత్యవసర సమావేశం సోమవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. క్రియాశీల సభ్య త్వ నమోదు, నియోజకవర్గ వ్యాప్తంగా మహా ఉద్యమాలు, ప్రతి గ్రామం-ప్రతి వార్డు స్థాయిలో సభ్యత్వ డ్రైవ్‌ను భారీ స్థాయిలో చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి పంచాయతీ, ప్రతి వార్డులో జనసేన కార్యాలయాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. మున్సి పాలిటీలో రెండు సమన్వయ కార్యాలయాల ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రజా క్షేత్రంలో ప్రజా సమస్యలు పరిష్కరించుకుంటూ, అన్యాయాలని అక్రమా లని ఎదురి స్తూనే ఉంటామని తీర్మానం చేశారు. సీనియర్ నేతకు అన్యాయంపై జిల్లా అధ్యక్షుడు, పీఏసీ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో నాయకులు దువ్వాడ వంశీ కృష్ణ చౌదరి, కోన కృష్ణ రావు, నందిగాం ధర్మా రావు, తులసి, తుంగన దేవ, తమాడ రాము, దీన పాత్రో, కేదరా నాథ్, శివ, కార్తీక్, ఉదయ్, గణేష్ రెడ్డి, శంకు శ్రీకాంత్, సర్పవర్పు ప్రదీప్, వర్మ, పుచ్చ భీమారావు, ఆదిలక్ష్మి, దున్న రామారావు, పాపా రావు, జనసైనికులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎస్ పథకంతో సేవాతత్వం



**పలాస, డిసెంబరు 1(వార్త):** జాతీయ సేవా పథకం(ఎన్ఎస్-ఎస్)ద్వారా విద్యార్థులు సేవతత్వం అలవర్చుకుంటారని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి రమణ, ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. సోమవారం వారు వజ్రపుకొత్తూరు మండలం పూండి-గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రారంభించారు. తొలుత మొక్కలు నాటారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సేవా పథకంతో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, సామాజిక వ్యక్తిగత బాధ్యత పెరుగుతుందన్నారు. ఈ సేవా కార్యక్రమాలు ఏడు రోజుల పాటు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్, పరిసరాల పరిశుభ్రత ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించారు. జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం తదితర కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎస్ రూప్‌సుందర్, అధ్యాపకులు కేశవరావు, ఝాన్సీ, భాగ్యలక్ష్మి, రాంబాబు, సౌజన్య, ఆలేఖ్య, వాణి, రమణ, పున్నయ్య పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు చేస్తున్న మేలును మరవద్దు



**పలాస, డిసెంబరు 1(వార్త):** ఇంటికి పెద్ద కొడుకులా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబును మర్చిపోవద్దని రాష్ట్ర శ్రీశయన సాధికారిక కమిటీ మెంబర్ బూర్ల కృష్ణంరాజు అన్నారు. సోమవారం ఆయన కిస్టుపురంలో పేదల సేవలో పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి హామీ నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సోంపేటలో ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ





**సోంపేట, డిసెంబరు 1(వార్త):** వైసీబీ ట్రక్కర్స్ సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుంచి సూపరింటెండెంట్ డాక్టర్ టి.వెంకటేశం, పలువురు వైద్యులు సిబ్బంది, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, కళాశాల అధ్యాపకులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఐసీటీసీ కౌన్సిలర్ భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## 3 నుంచి దత్తాత్రేయ స్వామి వార్షికోత్సవం



**సోంపేట, డిసెంబరు 1(వార్త):** ఈనెల మూడవ తేదీ నుంచి పలాసపురంలో వెలసిన దత్తాత్రేయ స్వామి వారి 71వ వార్షిక జయంత్యుత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తడక జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలతో పాటు జిల్లా స్థాయిలో పాడుతా తీయగా పేరిట పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి కింద రూ.9116లు, ద్వితీయ బహుమతి కింద రూ.7116లు, తృతీయ బహుమతి కింద రూ.5116లు అందించనున్నామన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



**పలాస, డిసెంబరు 1(వార్త):** పలాస మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమ స్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జి.కనకరాజుకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కనీస వేతనాలు అమలు చేయాలని, 2023 నాటి సమ్మె కాలపు ఒప్పందాల జీవోలు జారీ చేయాలని, 2011, 12 పీఎఫ్ కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, కార్మికులను పెంచి పని భారం తగ్గించాలని, మరణించిన, రిటైరైన వారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్.గణపతి, యూనియన్ నాయ కులు సీహెచ్ మురగన్, ఎం.రవి, ప్రకాష్‌ముఖి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

**ఇచ్ఛాపురం, డిసెంబరు 1(వార్త):** మద్యం తాగి బైక్ నడిపినందుకు ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ లు మెరక వీధికి చెందిన తిప్పన రమణను అరెస్టు చేసి, ఇచ్ఛాపురం మేజిస్ట్రేట్ పి.ఫరీష్ కుమార్ ఎదుట ప్రవేశపెట్టగా, 5 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎం.ముకుందరావు తెలిపారు. నరసన్నపేట జైలు కి రిమాండ్ నిమిత్తం తరలించినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపిన బహిరంగంగా మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇచ్ఛాపురం పోలీసులు హెచ్చరించారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

**ఇచ్ఛాపురం, డిసెంబరు 1(వార్త):** బాలకృష్ణాపురం గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పించన్లు పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ కుమారి, సర్పంచ్ ప్రతినిధి లోహిదాస్, వైస్ సర్పంచ్ జగ్గయ్య, రామోజీ, కృష్ణయ్య, మనోజ్, వీఆర్వో డిల్లిరావు , వెంకటరావు, కృష్ణ , కోట దాలమ్మ పాల్గొన్నారు.16 వ వార్డ్ లో ఇన్ ఛార్జ్ నాగరాజు పాత్రో,బూత్ కన్వీనర్ రవికుమార్ గౌడో, వార్డ్ కమిటీ అధ్యక్షుడు శ్యాంసుందర్ పాల్గొన్నారు.11 వ వార్డు లో కౌన్సిలర్ ఆసి లీలా రాణి పంపిణీ చేశారు.15 వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమంలో నందిగం కోటేశ్వరరావు, సరస్వతి, సచివాలయం సిబ్బంది, హుస్సేన్, జీనత్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వెలిగిన వీధి దీపాలు



**-నిర్వహణ లోపం.. వెలగని వీధి దీపం కథనంపై స్పందన**

**- టంకాల దిగ్గువలసలో విద్యుత్ దీపాల ఏర్పాటు**

**జి.సిగడాం, డిసెంబరు 1(వార్త):** టంకాల దిగ్గువలస గ్రామంలో వీధి లైట్లు వెలగకపోవడంపై నిర్వహణ లోపం.. వెలగని వీధి దీపం అనే కథనం జాతీయ వార్త పత్రికలో ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో ఈ కథనంపై ఎంపీడీవో జి.రామకృష్ణారావు స్పందించి, లైట్లు వేయాలని పంచాయతీ కార్యదర్శి అసిరయ్యకు అదేశించారు. వెంటనే వెలగని పలు విద్యుత్ స్థంబాలను గుర్తించి కొత్త విద్యుత్ దీపాలను సర్పంచ్ ప్రతినిధి టంకాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి వీధుల్లో కాంతులను వికసింపజేశారు.



# వర్షంతో రైతన్నల ఆందోళన

**-వరి పంటను కుప్పలు వేసి పరజాలు కప్పిన వైనం**

**- జల్లులతో కోతలకు బ్రేక్**

**-దిత్వా తుఫాన్ ప్రభావం లేనప్పటికీ అక్కడక్కడ వానలు**

**- రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**హిరమండలం/ఎల్ఎన్ పేట, డిసెంబరు 1(వార్త):** దిత్వా తుఫాన్ సందర్భంగా రైతులు తమ పంటల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లాకు దిత్వా తుఫాన్ ప్రభావం లేనప్పటికీ కొన్ని మండలాల్లో అక్కడక్కడ వర్షాలు. కురుస్తుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతులు ముమ్మరంగా వరిపంటను కూలీలు, వరికోత యంత్రాలతో వరికోతలు నిర్వహిస్తుండటంతో ఎటుచూసినా ధాన్యపురాశులే దర్శనమిస్తున్నాయి. పచ్చిగా ఉన్న ధాన్యంను జాతీయ రహదారులపై, గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో ధాన్యాన్ని పోసి ఆరబెట్టుకుంటున్నారు. ఇంతలో ఈ దిత్వా తుఫాన్ కారణం వలన అక్కడక్కడ వర్షాలు కురవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. అన్నదాత ఆరుగాలం కష్టపడి రెప్పలు ముక్కలు చేసుకుని బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టుకుని వంట పండించి ఇంటికి తెచ్చుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవించి వర్షం పడుతుండటంతో రైతన్నల్లో ఆందోళన నెలకొంది. కొన్ని చోట్ల కోసిన వరిచేనును పొలాల్లోనే కుప్పలు వేసి పరజలు కప్పుకుని పంటను





రక్షించుకున్నారు. ఒకవైపు ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ఏర్పాటు చేయడంతో చాలామంది రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు ఎన్ని మారినా రైతులకు మద్దతు ధర ప్రకటకనకే తప్ప ధాన్యం కొనుగోలు కేంద్రాలను అనుకున్న సమయంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఎటువంటి గత్యంతరం లేక దళారులు అడిగిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రెక్కలు ముక్కలు చేసుకుని పంట చేతికి వచ్చేసరికి రైతులు నష్టానికి అమ్ముకునే పరిస్థితి దాపురిస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు. అన్నదాతకు ప్రభుత్వం అలంభనగా కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేయలేకపోతుంది అని అన్నదాత ఆవేదన చెందుతున్న క్రమం... ఒకవైపు వర్షాలు ప్రభావం గత నెల రోజులుగా వరి ధాన్యం పంట చేతికి వస్తోంది ఇంతలో అక్టోబర్ నెల ఆఖరున మొందా తుఫాన్ ప్రభావంతో కొన్నిచోట్ల వరిచేను పంటలు నీటిలోమునిగి వరి పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వం నుంచి రైతాంగానికి ఎంటువంటి నష్టపరిహారం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు కలుగజేసుకొని రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని అన్ని రైతు సేవాకేంద్రాలనుంచి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## పలాస డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ దినోత్సవం



**పలాస, డిసెంబరు 1(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్క రించుకుని కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మైదానంలో రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, జాగ్రత్తలపై అవగా హన సదస్సు ఏర్పాటు చేసి మార్గదర్శనం కల్పించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి.నరసింహులు, సైన్స్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పట్నాయక్, జంతుశాస్త్ర అధ్యాపకులు ఎం.హెచ్.కె. ప్రసాద్, బి.కోదండరావు, ఇతర శాఖల అధ్యాపకులు పి.వి.సత్యనారాయణ, బి.ప్రసాదరావు, వై.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జింకుభద్రలో గీతా జయంతి



**సోంపేట, డిసెంబరు 1(వార్త):** జింకుభద్ర గ్రామంలో సోమవారం గీతా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణ భగవాన్ చిత్రపటానికి పూజలు నిర్వహించి శ్రీకృష్ణ పరమాత్మనే గీత సందేశాన్ని గూర్చి వక్తలు వివరించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు హాజరై పాల్గొన్నారు. నిర్వాహకులతో కలిసి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## పింఛన్లతో పేదలకు ఎంతో మేలు



**మందస, డిసెంబరు 1(వార్త):** ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లతో పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, సోషల్ వర్కర్ పుల్లా వాసుదేవు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో కొందరికి ఆయన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్లు పేదలకు వరంగా మారాయన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులకు కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. ఆయా లబ్ధిదారులు నెలకు సరిపోయే విధంగా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. అర్హులందరికీ అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి పథాన నడుస్తోందని కొనియాడారు.


## యునైటెడ్ క్రిస్మస్ వేడుకల్లో అన్వేష్





**ఇచ్ఛాపురం, డిసెంబరు 1(వార్త):** డా. బి. అర్. అంబేద్కర్ ఆడిటోరియం, లో బిషప్స్ డయోసీస్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యం లోయునైటెడ్ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. బిషప్. గంజి అర్ ఎజ్రా , ఫెయిత్ హోమ్ చర్చి శ్రీకాకుళం అధ్యక్షతన ఏర్పాటు చేశారు, ముఖ్య ప్రసంగికులు గా బిషప్. డా.యలమంచిలి.ప్రవీణ్ , ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ ప్రత్తి అన్వేష్ (స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ), పాల్గొన్నారు, బిషప్. డా. కొత్తపల్లి అబ్రహం పాల్గొన్నారు., ఈ కార్యక్రమంలో జిల్లా లో ఉన్న అనేకమంది దైవ సేవకులు పాల్గొన్నారు, వచ్చిన ప్రతి ఒక్కరికి వస్త్రాలు బహుమతిగా పంచి పెట్టారు. అనంతరం క్రిస్మస్ ప్రేమ విందు ఏర్పాటు చేశారు, క్రిస్మస్ పాటలతో ప్రార్థన లతో ఘనంగా నిర్వహించారు.

## చల్లపేట -అంబావల్లి వరకు జంగిల్ క్లియరెన్స్

**జలుమూరు, డిసెంబరు 1(వార్త):** చల్లపేట నుండచి అంబావల్లి వరకు రోడ్డు పక్కన వున్నా ముల్లా తుప్పలు మరియు రోడ్ పైకి వచేస్తున్న చెట్లు కొమ్మల్ని తిసివేయడం జరుగుతుంధి అని ఆర్.ఎన్.బి జె.ఇ తేలిపారు. ఈ మద్య చాల రోడ్డు ప్రమాదాలు జరిగయి వాటిని దృష్టిలో పెట్టుకోని శ్రీముఖలింగనికి ఛందిన నాయుడుగారి రాజశేఖర్ అన్‌లైన్ పి.జి.ఆర్ లో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయసారు. ఈ జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు శ్రీ ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## నరసన్నపేటలో వీధి కుక్కల స్వైర విహారం



**నరసన్నపేట, డిసెంబరు 1(వార్త):** నరసన్నపేటలో వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజల బెంబేలెత్తుతున్నారు. మారుతీ నగర్ జంక్షన్ ప్రధాన రహదారిపై సోమవారం కుక్కలు హల్చల్ చేశాయి. దీంతో వాహనదారులు, నడక ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ద్విచక్ర వాహనాలు, కార్ల వెంబడి పరిగెడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు వాపోయారు. చివరికి నరసన్నపేట కాస్త వీదికుక్కల'పేట' అవుతుందని ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



**జలుమూరు, డిసెంబరు 1(వార్త):** జలుమూరు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-1990 సంవత్సర వరకు ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా అదే పాఠశాలలో 35 సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఒకరికొకరు క్షేమ సమాచారాలను తెలుసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు ఆనందం పంచుకున్నారు.

## నిగమానంద ఆశ్రమంలో గీతా జయంతి



**ఇచ్ఛాపురం, డిసెంబరు 1(వార్త):** కేసుపురం పంచాయితీ నీలాపుపుట్టుగ గ్రామంలో నిగమానంద గీతాశ్రమం లో గీతా జయంతి సందర్భంగా గీతా పారాయణం, లోక కళ్యాణం కోసం హెూమం నిర్వహించారుగురువు హరిహర చైతన్య స్వామి గంగా మాత తల్లీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు జరిగాయి.జయగురు భక్తులు అందరు కలిసి పాలు పంచు కొన్నారు ఈ కార్యక్రమ లో ఇచ్ఛాపురం మండలం మాజీ ఎంపీపీ దక్కతఢిల్లీరావు , రూపానంద స్వామి ముత్యాలమ్మ , గీతా పారాయణం ఎస్ వి జె స్కూల్ విద్యార్థులు నిర్వహించారు. ప్రవసనం కర్తలు బందరు దుర్గాప్రసాద్ , ఈపీరీ రమణమూర్తి, , మొగిలి సీతారాం, దివాకర్, మోహనరావు, మరియు గ్రామల నుండి భక్తులు అందరుపాల్గొన్నారు.

## ప్రయాణికులకు శుభవార్త




**శ్రీకాకుళం, డిసెంబరు 1(వార్త):** శ్రీకాకుళం నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి శ్రీకాకుళంకు నడిచే ఇంద్ర బస్సుల ప్రయాణ ఛార్జీలను ఆర్టీసీ తగ్గించింది. ఇవాళ వెలువరించిన నిర్ణయంలో భాగంగా ఇరవై శాతం మేర తగ్గించి ప్రయాణికులకు ఊరట కల్పించింది. ఇకపై కేవలం 743 రూపాయలకే విజయవాడ, శ్రీకాకుళం నగరాల మధ్య రాకపోకలు సాగించవచ్చు.ఇప్పటివరకూ ఉన్న టికెట్ ధర రూ.928లు.


# పలాసను జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలి

**-త్వరలో మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం**

**-క్షేత్రస్థాయిలో సంతకాల సేకరణ**

**- శాంతియుతంగానే ప్రజా ఉద్యమం**

**-ప్రముఖ సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్**



**పలాస, డిసెంబరు 1(వార్త):** పలాస కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రముఖ సామాజికవేత్త, న్యాయవాది దువ్వాడ శ్రీధర్(బాబా) డిమాండ్ చేశారు. సోమవారం పలాసలో ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. జిల్లా ఎటువంటి అభివృద్ధికి నోచుకోక వెనుకబడినదిగా ముద్ర పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాల్లో కొన్ని ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, ఇందుకు పాలకుల వివక్షతతో ఎంతో నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం ప్రగతి పదంలో పయనించాలంటే పలాస కేంద్రంగా జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకతీతంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రతిపక్ష నేత, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, వామపక్ష పార్టీ నేతలు, ఇతర ప్రజా సంఘాల దృష్టికి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన వజ్జ



**పలాస, డిసెంబరు 1(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు సోమవారం పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 01,02,19,20,22,23 వ వార్డు లో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులుతో కలిసి వృద్ధులు, వికలాంగులకు మరియు వితంతువులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.4,000 నుంచి రూ15,000 వరకు పెంచిన పింఛన్లు మీ ఇంటి ముఖ్యద్వారం వద్దకే చేరుతా యని చెప్పారు. "వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళల జీవితాల్లో కొత్త ఆలోకవెలుగులు నింపుతున్న ఈ పథకం, సచివాలయ సిబ్బంది మీ ఇంటి వీధికి చేరి పంపిణీ చేస్తున్నారు. మా కూటమి ప్రభుత్వం ప్రజలకు పెద్దన్నల్లా వ్యవహరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పలాస టిడిపి నాయకులు సప్ప నవీన్, దడే నరసింహులు, వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కుల సంఘం మహాసభలను విజయవంతం చేయండి

**పలాస, డిసెంబరు 1(వార్త):** ఐదు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రజల పౌర ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తూ ఉన్నది ప్రజలు ఉద్యమించే హక్కు మీద ఏ రూపంలో దాడి జరిగిన ఆ అణిచివేతను ప్రశ్నిస్తూ వస్తుంది సమాజంలో వివిధ వర్గాల సమూహాల తమ తమ హక్కుల సాధన కోసం అనేక పోరాటాలకు ప్రజా ఉద్యమాలకు మద్దతునిస్తూ వస్తున్నది. దశాబ్దాలకు రాజ్య హింసకు బూటకపు ఎన్కౌంటర్లకు కు వ్యతిరేకంగా తన కర్తవ్యాన్ని నిర్వహించింది. ఆ క్రమంలోనే నేటి వరకు రాష్ట్రంలో దేశంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు మద్దతులిస్తూ 20వ రాష్ట్ర మహాసభలు జనవరి 10 11 తేదీలలో తిరుపతిలో జరుపుకుంటుంది. రెండు రాష్ట్రాల్లో ఉన్న ప్రజలు ప్రజాస్వామ్యవాదులు బుద్ధి జీవులు మేధావులు కవులు కళాకారులు హక్కుల కార్యకర్తలు సామాజిక వేత్తలు పాల్గొని రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సోమవారం పిలుపునిచ్చారు. బొడ్డపాడు గ్రామంలో కరపత్ర ఆవిష్కరణలో పౌర హక్కుల సంఘంతోపాటు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం సాలిని వీరస్వామి, లక్ష్మణ్, కుల నిర్మూలన పోరాట సమితి ప్రభాకర్, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం గీతరాణి, మహిళా సంఘ నాయకులు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఎయిడ్స్ నివారణపై మానవహారం




**పలాస, డిసెంబరు 1(వార్త):** ఎయిడ్స్ మహమ్మారి నివారణ కోరుతూ పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మానవహారంగా ఏర్పడ్డారు. సోమవారం ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుర చరితరుడు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవ రావు, తమ్మినాన పాపారావు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## ముగిసిన మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు

**ఇచ్ఛాపురం, డిసెంబరు 1(వార్త):** సురంగి రాజా క్రీడా మైదానంలో శనివారం మరియు సోమవారం నిర్వహించిన మండల స్థాయి గ్రిగ్స్ పోటీల్లో మండలంలోని గల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్ కబాడీ ఖో ఖో బ్యాడ్మింటన్ క్రీడాంశాలలో బాల, బాలికలకు జూనియర్ మరియు సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరిగింది.. ఈ పోటీల్లో విజేతలు ఈనెల 8 నుంచి10 తేదీల్లో జరుగనున్న జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారు.. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు అప్పారావు, విశ్వనాథం లు పర్యవేక్షించారు..

కార్యక్రమంలో జోన్ 1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పద్మనాభం రెడ్డి, కృష్ణ పోడియా మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి చెలగాటం

**- జగన్మోహన్ రెడ్డి పాలనలో సంపూర్ణ భరోసా**

**- ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించిన ప్రభుత్వం**

**-రుణాల ఊబిలో తల్లిదండ్రులు**

**-మాజీ ఎమ్మెల్యేరెడ్డి శాంతి**

**ఎల్ఎన్ పేట, డిసెంబరు 1(వార్త):** టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఉన్నత విద్యకు గండం ఏర్పడిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చంద్రబాబు సర్కార్ చెలగాటం ఆడుతోందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి గారు తీవ్రంగా విమర్శించారు. షెడ్యూల్ ప్రకారం ఫీజు చెల్లింపులను అడ్డుకున్న చంద్రబాబు ప్రభుత్వం, కాలేజీల ఒత్తిళ్లు తట్టుకోలేక తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టాల్సిన దుస్థితిని కల్పించింది. ఫీజులు కట్టలేదనే సాకుతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు సైతం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని దయనీయ పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. ఎన్నికల సమయంలో కాలేజీల ఖాతాల్లోనే ఆరు నెలలకు ఒకసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని నమ్మబలికిన చంద్రబాబు ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపింది. పాక్షికంగా ఫీజుల విడుదలతో విద్యార్థుల చదువులకు పెను ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. గత ఏడాదిన్నరకు పైగా చంద్రబాబు సర్కార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను అటకెక్కించింది. ఇప్పటి వరకు చెల్లించాల్సిన ఎనిమిది క్వార్టర్ల ఫీజుల డబ్బులు రూ.5,600 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ కింద విద్యార్థులకు ఇవ్వాల్సిన మరో రూ.2,200 కోట్లు కలిపి మొత్తం రూ.7,800 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. నిధులను తొక్కిపెట్టి, అరకొరగా, పాక్షిక చెల్లింపులు చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రభుత్వం తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తేలికగా ఎగ్గొట్టవచ్చనే దురుద్దేశంతోనే తల్లుల ఖాతాలో కాకుండా కాలేజీల ఖాతాలో జమ చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నమ్మబలికారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నత విద్యలో పూర్తి ఫీజురీయింబర్స్మెంట్ అమలు చేసి చరిత్ర సృష్టించారు. ?జగనన్న పాలనలో పిల్లల చదువులకు పూర్తి భరోసా కల్పిస్తూ, క్రమం తప్పకుండా త్రైమాసికం వారీగా తల్లుల ఖాతాల్లోనే నిధులు జమ చేశారు. ?కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పిల్లల చదువులకు ఆటంకం లేకుండా సంపూర్ణ భరోసా కల్పించి ఐదేళ్ల పాటు అండగా నిలిచారని, త్రైమా వారీగా నిధుల విడుదలకు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.






## వరి చేనుకుప్పకు నిప్పు పెట్టిన దుండగులు



**మెళియాపుట్టి, డిసెంబరు 1(వార్త):** వ్యక్తుల మధ్య ఘర్షణలు, తగాదాలు తదితర వాటి స్థాయి దాటి వరి పైరు కోసి కుప్పపెట్టి ఉన్నదానికి అర్ధరాత్రి సమయంలో నిప్పు అంటించి దగ్ధం చేసే సంఘటన మెలియాపుట్టి మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే మెలియాపుట్టి మండలంలో గల జాడుపల్లి గ్రామంలో కలమట సూర్యనారాయణ అనే రైతుకు చెందిన సుమారు 50 సెంట్లు విస్తీర్ణం గల పంట పొలంలో నున్న వరిసేను కుప్పను ఆదివారం అర్ధరాత్రి సమయంలో అనుమానాస్పద వ్యక్తులు నిప్పంటించి దగ్ధం చేశారని స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం నాడు ఫిర్యాదు చేశారని సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి అగ్నిమాపక సిబ్బంది వచ్చినప్పటికీ వరి చేను కుప్ప దగ్ధమైందని, భూ వివాదం కారణంగానే ఈ ఘటనకు పాల్పడ్డారని రైతు కలమట సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఎయిడ్స్ డే



**ఇచ్ఛాపురం, డిసెంబరు 1(వార్త):** వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాల ఇచ్చాపురం నందు విద్యార్థులచే ఎయిడ్స డే అమరిక లో కూర్చుండబెట్టి ఎయిడ్స్ డే గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూర్యారావు మరియు సెక్రటరీ సాయిబాబా సీనియర్ ఉపాధ్యాయులు జయలక్ష్మి పద్మాబాయి, సూర్యం, రామలక్ష్మి జోగేష్ , వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్ , రంగారావు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌ను తరిమికొడదాం




**పలాస, డిసెంబరు 1(వార్త):** ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్ భూతాన్ని సమాజం నుంచి తరిమి తరిమి కొట్టాలని పలాసమండల సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం పలాస మండల న్యాయ సేవా సంఘం, పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సంయుక్తంగా ర్యాలీ సోమవారం నిర్వహించారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. చేయి-చేయి కలుపుదాం, ఎయిడ్స్ ని తరుముదాం, నిశ్శబ్దాన్ని చేదిద్దాం-ఎయిడ్స్ గురించి, హెచ్ఐవి నివారణ బాధ్యత అందరిది అనే నినాదలతో న్యాయవాదులు, డాక్టర్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఎస్ బి ఎస్ వై ఎం డిగ్రీ కాలేజికి చెందిన ఎన్ సి సి క్యాడెట్లు కలసి ఈ ర్యాలీ ను నిర్వహించారు. సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలని,హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపించరాదని, యువత వ్యసనాలకు బానిస కారాదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి ఎం ఎస్ అనిల్ రాజు, న్యాయవాది కే. లోకేశ్వర రావు, పలాస ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యులు రఘురామ్, మేఘన, మనోహర్, ఐ సి టి సి కౌన్సిలర్ శ్రీకాంత్, పారాలీగల్ వాలంటీర్లు అనంత్, గెస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తిరుపతి, హాస్పిటల్ సిబ్బంది చంద్రకళ, రాణి, మమత తదితరులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురం పాఠశాలలో ఘనంగా గీత జయంతి వేడుకలు

**జలుమూరు, డిసెంబరు 1(వార్త):** జలుమూరు మండలం అచ్చుతాపురం ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా గీత జయంతి వేడుకలు సోమవారం జరిగింది. పాఠశాలలో హెచ్ఎం సిహెచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు భగవద్గీత గురించి తెలుసుకోవాలని, అంతేకాకుండా చదివేందుకు ప్రయత్నించాలని సూచించారు. భగవద్గీత గురించి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయుడు బాబురావుతో పాటు పలువురు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**నరసన్నపేట, డిసెంబరు 1(వార్త):** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.

సోమవారం నరసన్నపేట మండలం, గోపాలపెంట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో కలసి పాల్గొని లబ్దిదారులకు పింఛన్లు స్వయంగా అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసాతో నిరుపేదలకు, నిరాశ్రయులకు ఆర్థిక భరోసా చేకూరుతుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాగానే పింఛను మూడు వేల నుండి నాలుగు వేలకు పెంపు చేయడం, పింఛన్లు ప్రతినెల మొదటి తారీకునే అందజేయడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీకి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. మొదటి రోజునే నూరు శాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలని సంబంధిత సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎటువంటి ఆలస్యం లేకుండా పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయిస్తున్నట్లు స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర నర్సింహులు, నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ ఛైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, అప్పలనాయుడు, యూనిట్ ఇంచార్జి యాళ్ళ వేణుగోపాలరావు, మాజీ సర్పంచ్ సాధు గరికన్న, గదిలి ఈశ్వరరావు, పాలకొండ సూర్యనారాయణ, సింగూరి భీష్మాచార్యులు, మార్పు గోవింద, బొట్ట వినోద్, సతీష్, గోపి, మహేష్, రాజేష్, హరిబాబు మరియు ఎంపీడీవో, సచివాలయం సిబ్బంది కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ కృషి

**ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్ ) రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణు**




**నరసన్నపేట, డిసెంబరు 1(వార్త):** సమాజంలో జర్నలిస్టులు హక్కులు, సమస్యలపై పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్ ) ముందుంటుందని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం నరసన్నపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఆదివారం నరసన్నపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే వెటర్న్ జర్నలిస్టుల పెన్షన్ కోసం గౌరవ వేతనం కోసం, ఇళ్ల స్థలాల కోసం, అక్రిడేసన్ కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తుందని ఆయన అన్నారు 45 సంవత్సరములు దాటిన .. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్. భాస్కరరావు, డస్క్ జర్నలిస్టుల ప్రతినిధి బి. ప్రసాదరావు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సదాశివుని కృష్ణ, నరసన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గంగు మన్మధరావు, ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి పంగ రమణ, అధ్యక్షులు గురుగుబెల్లి నర్సింగరావు, ఫ్రీ లాన్సర్ గౌరీ శంకర్, తంద్యాల జనార్ధనరావు లతోపాటు సీనియర్ జర్నలిస్టులు నెయ్యిల నారాయణరావు, గుంట కర్ణవీరుడు, సిహెచ్ విశ్వేశ్వరరావు, పి.వి.ఎస్.ఎన్ మూర్తి, శరత్ బాబు, ఎస్.ఎస్ భాస్కరరావు, ఎన్. టీవీ మధుసూదనరావు, సత్యనారాయణ, డి. గిరిధర్, యాబాజి రాము, తదితరులు పాల్గొన్నారు.

# కార్గో ఎయిర్‌పోర్టుతో గ్రామాల అభివృద్ధి

**ఆర్డీఓ వెంకటేష్, లీగల్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు**

**మందస, డిసెంబరు 1(వార్త):** ఉద్దానంలో నిర్మించతలపెట్టిన కార్గో ఎయిర్ పోర్టుతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పలాస ఆర్డీఓ జి.వెంకటేష్, ఎయిర్ పోర్టు లీగల్ అడ్వయిజర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దానంలో ఎయిర్ పోర్టును నిర్మించడానికి నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామాలు ఎంతగానే అభివృద్ధి చెందుతాయన్నారు. వెనుకబడిన జిల్లాగా గుర్తింపు పొందిన శ్రీకాకుళంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ఎయిర్ పోర్టు ప్రభావిత గ్రామాల్లో గ్రామాల్లో పర్యటించి, ప్రతీ గ్రామానికి షెడ్యూల్ కూడా ప్రకటించి.. గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభల ద్వారా ఎయిర్ పోర్టుతో లాభ, నష్టాలతో పాటు నష్టపరిహారం వివరాలను కూడా రైతులకు వివరంగా తెలియజేస్తామన్నారు. మెట్టూరు, చీపురుపల్లి, బిడిమి గ్రామాల్లో 95శాతం, 5గ్రామాల్లో 5శాతం ఎయిర్ పోర్టు నిర్మాణం జరుగనుందన్నారు. ప్రభావిత మూడు గ్రామాల్లోని ఇళ్లకు ఎటువంటి నష్టం జరుగడంలేదన్నారు. వ్యవసాయ భూమి 1000 ఎకరాలు, ప్రభుత్వ భూమి 200ఎకరాలు భూసేకరణ చేయనున్నామన్నారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, సర్వేయర్ బొడ్డపాటి బాబురావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇందిరా పాల్గొన్నారు.



## కొత్తమ్మతల్లిని దర్శించుకున్న అచ్చెన్న



**కోటబొమ్మాళి, డిసెంబరు 1(వార్త):** కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయానికి నిధులు విడుదల చేయించిన మంత్రి అచ్చెన్న. ఐదు కోట్ల రూపాయలు విడుదల చేయించిన వైనం. ఈ క్రమంలో ఇవాళ ఆయన అమ్మవారిని దర్శించుకుని, తమ ఇలవేల్పునకు ప్రత్యేక పూజలు చేశారు.


## హెచ్ఐవీ పట్ల భయం వద్దు



**శ్రీకాకుళం, డిసెంబర్1(వార్త):** హెచ్ఐవీ పట్ల భయపడవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టర్ బంగ్లా లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 60 మంది పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేసి వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలు హెచ్ఐవి పట్ల భయపడవద్దని, హెచ్ఐవి బాధితులను అక్కున చేర్చుకోవాలని, వారి పట్ల వివక్ష చూపరాదని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఎఆర్టీ మందులు వైరల్ లోడ్‌ను తగ్గించి వ్యాధి సంక్రమణ అవకాశాన్ని గణనీ యంగా తగ్గిస్తుందన్నారు. రిస్క్ గ్రూపులకు చెందిన వారు నిరంతరం హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవా లని ఆయన కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి డాక్టర్ కె. అనిత మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ ప్రివలెన్స్, అందుబాటులో ఉన్న ఐసిటిసి, ఎఆర్టీ కేంద్రాలు, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఎఆర్టీ మందుల సేవలు గురించి వివరించారు. గత సంవత్సరాలతో పోలిస్తే హెచ్ఐవి కేసులు తగ్గుముఖం పడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫార్మాన్ అహ్మద్ ఖాన్, సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్య దర్శి ఏ. హరిబాబు, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, శ్రీకాకుళం ఆర్డీవో కె. సాయి ప్రత్యూష, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిపి కిరణ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, వికలాంగుల శాఖ అసి స్టెంట్ డైరెక్టర్ బి. శైలజ, ఎడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ మేరీకేథరీన్, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్ బాబు, డాక్టర్ శ్రీకాంత్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కెవి ఆర్ శైలజ, ఎఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చి. అప్పలనాయుడు, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ శివరామ కృష్ణ, జిల్లా పాజిటివ్ నెట్వర్క్ ప్రెసిడెంట్, సిఎస్సీ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మణరావు, అతిథి పిడి శంకర్ రావుతో పాటు హారికా కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ సభ్యులు, భాగస్వామి ఎన్జీవోలు, లింక్ వర్కర్ స్కీం, టార్గెట్ ఇంటర్వెన్షన్ టీమ్‌లు, సిఎస్సీ, విహెచ్ఎస్ సంస్థలు, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి సర్టిఫికెట్లు, మెమెంటోలు, అవార్డులు ప్రదానం చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికా హారం పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ బంగ్లా ప్రాంగణం నుంచి ఎయిడ్స్ అవగాహన ర్యాలీకి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ర్యాలీ డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి 7 రోడ్ల కూడలి వరకు కొనసాగింది. విద్యార్థులు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలు భారీగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేసి, హెచ్ఐవి పై అపోహలు, వివక్షత నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రంగోలి, క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

### బాధితులకు అండగా న్యాయ సేవలు

సమాజంలో ఎయిడ్స్ వ్యాధికి సంబంధించిన సామాజిక కళంకాన్ని పూర్తిగా తొలగించి, ఈ మహమ్మారిపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. స్థానిక న్యాయ సేవా సదన్ కార్యాలయంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో సోమవారం ఆయన న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్వం మందులు లేని కారణంగా ఎయిడ్స్ అంటే మరణ శాసనంగా భావించే వారని, కానీ నేడు వైద్య రంగం అద్భుతమైన పురోగతి సాధించిందన్నారు. సరైన సమయంలో హెచ్ఐవీని గుర్తించి, క్రమం తప్పకుండా మందులు వాడితే బాధితులు కూడా సాధారణ వ్యక్తుల మాదిరిగానే ఆరోగ్యకరమైన, దీర్ఘకాలిక జీవితాన్ని గడపవచ్చని భరోసా ఇచ్చారు. ఎయిడ్స్ అనేది కేవలం ఒక అనారోగ్యం మాత్రమేనని, బాధితులతో స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించడం, వారిని దగ్గరకు తీసుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు చొరవతో, అరబిందో ఫార్మా కంపెనీ (పైడిభీమవరం), లయన్స్ క్లబ్ వారి సహకారంతో వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. అనిత, ఏపీటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ (పైడి భీమవరం), హర్షవల్లీ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సీనియర్ అడ్వకేట్ జి. ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546